



ఏమని కపితము సెపితివి, వెరిపుచ్చ
కాయదిని సెపితో?
అమవశినిశియన్నమాట అలసని పెదనా!

పదే పదే గుచ్చుకొంటున్నాయి వికటకవి అమ్ములు. ప్రియదూతిక అందియిచ్చిన కప్పురంపు విడెమున రాళ్లు, కప్పురానికి బదులు ఉప్పు పడలేదుగద?!

ప్రక్కనే ఉన్న తాటాకులదొంతర 'ప్రాంచద్భూషణ' కింకిణీరావం వినిపిస్తూన్నట్లే ఉంది. కవితా కన్యను ముచ్చటగా ఒడిలోకి తీసుకొని మురిపెంగా చూసుకొంటున్నారు ఆంధ్ర కవితా పితామహులు. అచ్చుపోసిన బ్రాహ్మణం .... అగ్నిహోత్రంలాంటి ఏకపత్నీవ్రతం! అహో! ప్రవరాఖ్యుడి పాత్రను తీర్చిదిద్ది బ్రాహ్మడిగా పుట్టిన ఋణం తీర్చుకున్నావు తాతా! 'ఇంతలు కన్నులుండ'....ఎంత చమత్కారపు కవిత....తరతరాలు నీ పేరు చెప్పుకోడానికిచాలదూ ఆ ఒఖ్ఖపద్యం!!. వాడు-ఆ తెనాలివాడు ఏదో అంటే అదో లెఖ్ఖా నీకు? అంటూ కవితాకన్య ఓదారుస్తున్నట్లే వినిపించిందేమో,.... తలెత్తి చూస్తే కనిపించింది....కవితా కన్యకాదు, ఆ వికటకవే! చేతిలోని తాటాకులు కట్ట పితామహుడి ఒడిలోకి విసిరి 'చూసుకో' అన్నట్లు నిర్లక్ష్యంగా తన ప్రక్కనే ఊయలబల్లమీద చతికిలబడ్డాడు.

"ఆంధ్రకవితా ప్రపితామహ'...."

అరి పిడుగా!!

"తెనాలిరామలింగకవి విరచిత.."

మనుచరిత్రమా?? కాదు కాదు!!.

"మను విచిత్రము"

అంతా తన ధోరణిలోనే మొదలైంది కథ, కథేమిటి ఆ పద్యాలన్నీ తన మనుచరిత్రలోనివే..ఎంతఘోరం! ఎంత ధైర్యం!

ప్రవరాఖ్యుడు ఆ గంధర్వులమ్మా యిని దున్నపోతు పూలతను తోసుకు పోయినట్లు పోయినాడు... అక్కడి వరకూ అంతా తన గ్రంథమే! ఆ తర్వాతనుంచి అక్షరాల్లోంచి ఏదో వింత కాంతి రావడం మొదలైంది... శైలిలో రాల్లరగించు విమల గాంధర్వం వినపడ్డం మొదలైంది.

ఆ విప్రకుమారుడి కింత బిగువూ దర్పమూ తెచ్చిపెట్టిం దెవరు? అని ప్రశ్నించుకుంది వనిత. "వనిత తనంతదా వలచి వచ్చిన...." తన్నే కదూ అంతా అనుకొనేది? కాదు! తానెంత మాత్రం అయిఉండదు! ఆ ఇల్లాలు ఎంత అందకత్తె - ఎంత శృంగార కళికకాకపోతే యీ నరుడు తన్నింత చులకనచేసి చెరుకువింటి చిచ్చులో పెట్టి పోగలడు??

కుబేరుడు బహూకరించిన దర్పణం ఉందిగా! చట్టునవెళ్లి అద్దం తెరిచి చూచింది, ఆపక పత్నిని చూపమంటూ.

ఎంతో అందంగా ఉంటుంద నుకొన్న ఆ కూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ....అబ్బే!.... అదేమిటీ అలాగుంది?! నుదురంతా కుంకుమ ఆ జుట్టు ఆకట్టు అదేమిటోలా గున్నాయి. ఇల్లాంటి ఇల్లాలి కేనా యీ బాపడు వ్రతం కాపాడుకుంటూ న్నది!!....ఇంతకూ ఏమైయ్యాడో?...

యక్షిణీ ఆ అద్దంలో మళ్లాచూచింది. ప్రవరుడింకా ఆ పరిసరాల్లో నే ఉన్నాడు-అమాయకుడు-కాదు శుద్ధ మట్టి బుర్ర; హిమాలయమేకాదు, ఇంకెక్కడికి వెళ్లదలచినా ఆ పాద లేపనం. ఎందుకేనా మంచిది, కొంచెం మిగిల్చి ఎందులోనేనాతీసి తెచ్చుకోవా అనే కొంచెంపాటి జ్ఞానమన్నా లేదు...

చెడ్డ చలిగా ఉందేమో పాపం.... ఎర్రశాలువా కప్పుకొని కూడా గజ గజలాడుతూ దేవదారు పొదల్లోదూరి కింకర్తవ్యం జపిస్తున్నాడు. సూర్యాస్త మయంకాబోతూన్నది....

ఈ మడిగట్టుకొన్న వాణ్ణి ఎందుకు మోసగించకూడదు?! రంభ ధర్మమా అంటూ నూరిపోసిన కామరూప విద్య పరీక్షించుకోవటానికి ఇదే మంచి అదను.... వరూధినిలో కొత్త శక్తి పుట్టుకొచ్చింది.

* * *

'ఆర్యపుత్రా! ఆర్యపుత్రా!!' హిమ గుహాంతరాల్ని సంగీత ప్రతిధ్వనులతో నింపుతున్న ఆగొంతు తన సోమిదమ్మదే!

ఇంటికి చేర్చు బాబోయ్! అంటూ ప్రారంభించబోతూన్న అగ్నిమీది దండకం ఆదిలోనే ఆశ్చర్యకారణంగా ఆపవలసివచ్చింది.

ఇంటావిడ రానేవచ్చేసింది.

సోమిదమ్మే! కాని ఏమిటో చాలా

దివ్యంగా మెరుస్తోంది... ముచ్చటగా తురుముకొన్న ఒకే ఒక్క మల్లెమొగ్గ విడజారుతూన్న క్రొమ్ముడి, కాటుక మీద వెన్నెల తళతళలతో ఎన్నడూ లేని అందంతో ఎదురుగా ఉన్నది..కల కాదుగదా ?

"కలనుకుంటున్నారా స్వామీ? మీరేమో రాత్రైరి ఆ బైరాగివాడేమో మరలా మన ముంగిటనే కనిపించె, అడిగాను-మీరిట్టా చిక్కువడినట్టు యోగ దృష్టికి కనిపించిందిట. ప్రార్థించాను-ఇచ్చాడు ఇదుగో యీ ఉద్ధరిణనిండా అదేపసరు - పాదాలకు పూసుకోండి, పోదాము; మీమీద బెంగతో అమ్మగారూ నాన్నగారూ ఏమౌతారో ఏమో..హయ్యో! నామతి బంగారం గాను,-చాలా ఆకలితో ఉంటిరిగదూ... ముందీవెన్న అప్పాలు - తీరాన్నంతో కాస్త ఎంగిలిపడండీ.... ఏదిలేకున్నా మృగనాభి విడెము మీకు తప్పని సరి గదా అని అదీ తెచ్చాను..." అన్నది ఆ అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి. అదేమిటో అదోలా చూస్తూ వెదిమెలు మెరుస్తుండగా. అంతవరకు తన గృహిణి అట్లా చూట్టం ఆ విప్రవరు డెరగనే ఎరగకపోవచ్చు.

వెన్నెల్లో తెల్లగా మల్లెమొగ్గ మొనల్లాంటి హిమశిఖరాలు చుట్టూరా.... ఇటునటు సుర ద్రాక్షలల్లుకొన్న దేవ కాంచన కుసుమాలు రాలుస్తున్న దివ్య దారువుల నీడల్లోంచి వస్తూన్న కస్తూరికాది పరిమళాలు .... పక్కన కూరిమి సోమిదేవి—ఇలాంటి స్వప్నం ఏనాడన్నా ఊహించనైనా లేదు.

'ఇక్కడినందన చందనోత్కరం... మీకుటీర నిలయంబులకున్ సరిరాక పోయెనే' అన్న ఆ పిల్ల మాటలో యదార్థం యిప్పుడు గోచరిస్తోంది. కుటీర నిలయాలని మర్యాదగానే అన్నది పాపం. ఆమాత్రానికే అప్పుడు కోపంవచ్చింది, కాని, అచ్చతెనుగులో గుడిసెలు అని ఉంటే న్యాయంగా ఉంటుందనిపిస్తున్న దిప్పుడు యీ రమణీయ ప్రకృతి చూస్తూంటే సోమిదమ్మ పక్కన ఉండడంవల్ల. ఇందుకే కాబోలు తీర్థయాత్రలు కళత్రంతోబాటు చేయాలంటారు.... చలిలేదుగదా చిరువేడికూడా గిలిగింతలు పెట్టుతున్నది....నాడు శివుడి మీద—ఆ గిరిసుత దాపునే ఉన్నప్పుడు ప్రయోగింపబడ్డ బాణాలు యీ చోట దిగబడిపోయి వాటి ప్రభావం యింకా ప్రసారం చేస్తున్నయ్యేమో....

"మళ్లీ దొరకని ఇలాంటి రేయి—యిక్కడే వెళ్లబుచ్చి మరీపోదాము" అన్నట్లుగా మెరిసే సోమిదేవి కళ్లల్లోకి చూశాడు విప్రుడు. ఆవిడ బుగ్గలు ఎరుపెక్కాయి....చేరువలోని సోమలత లల్లుకొన్న పొదరింట కాటుకచీకటిలో సన్నగా తెల్లగా రాలిన పూల కుప్ప

మత్తువాసనలతో పిలుస్తున్నది. ఆ చోటనే కాబోలు మన్మథుడు మట్టిలో కలిసి,మరలా రతికిమాత్రమేమిగిలింది.

* * *

మెలకువ వచ్చేసరికి బారెడు పొద్దెక్కి హిమం కరగటానికి మొదలు పెట్టింది. ఏదీ? సోమిదమ ఏదీ?!! హూప్—త్ఫూః......కలగన్నా ఎంత కమ్మని కలగన్నాను! అనుకుంటూ ప్రవరుడు లేచాడు. ఏమిటో శరీరం చాలా తేలికగా అదోహాయిగా—మహాఉత్సాహంగా ఉంది. ఇదంతా సోమలతల ప్రభావం అనుకున్నాడు సోమయాజి.

ఆ తర్వాత తీరిగ్గా ప్రార్థన మొదలు పెట్టాడు ఇల్లు చేర్చమని. కలలోగూడా నేను ఏకపత్నీ వ్రతుణ్ణే అయితే సాయంకాలం అగ్నికి హోజరౌతానని ఒట్టు పెట్టుకొంటూ. "పాపం! అమాయకుడు, కలకూ నిజానికీ తేడా గుర్తులేని అమాయకుడు...." అని జాలి పడ్డాడేమో అగ్గి, ఇల్లు చేర్చాడు. విశేషాలన్నీ చెప్పిచెప్పి ఆ రాత్రి ఓ కమ్మని ఘడియలో సోమిదేవికి గత రాత్రి తాగన్నకల సగర్వంగా చెప్పుకొని ఆమైకంతోనే ఆమెను తరింప జేశాడా ఏకపత్నీ వ్రతుడు.

* * *

ఆ తర్వాత..విధిలేక వరూధిని గంధర్వుణ్ణి వివాహమాడవలసి వచ్చింది.

* * *

తొమ్మిది దాటి పదో నెలలో అక్కడ హిమశిఖరాంచల రత్నకందరాంతరాల్లో, ఇక్కడ అరుణాస్పదపురంలో విప్రులింట రెండు బారసాల (బాలసారె) మహోత్సవాలు జరిగాయి.........,చప్పున అక్షరాలు నల్లబారినై, వింతకాంతి అంతరించి పోయింది. ఇహ అక్కణ్ణించి తన పద్యాలే మొదలైనాయి......ఆపాదమస్తకం పెద్దనగారికీ కప్పురపుతావి చెమటతో తడిసిపోయింది.

ఆంధ్ర భోజుడీ వరూధినిని చూస్తే వదుల్తాడా?! కళ్లు చెమ్మగిలుతున్నాయి—...."తాతగారూ!" అని వినపడే సరికీ తలెత్తి చూస్తే అప్పుడే వీధిలోంచి లోనికి వస్తూన్న తెనాలి రామలింగ కృష్ణ వికటకవి కుడిచేతిని ఏనుగు తొండంలాగ నొసటికి చేర్చి 'నమస్కారాలు' అంటున్నాడు.

పెద్దనగారు ఒడిలోని దేమిటో చూసుకుంటున్నారు కంగారుగా...తన మనుచరిత్రే....అంతా ఏదో భ్రాంతి.... ....ఛ్....

"పితామహులు కంగారు పడుతున్నారేం? మనవల మాటలకు మన్నించాలి తాతలు" అంటూన్న రామలింగణ్ణి చేరబిల్చి ఆలింగనం చేసుకున్నాడు ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన. ★